

**ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి**

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఎన్నికల పరిశీలకులు ఆదేశించారు. - 8లో..



**ఆరోగ్యం జాగ్రత్త సుమా..**

మహిళా పోలీసు సిబ్బంది ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 34 /20

**వాతావరణం**

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

## న్యూస్‌రీల్

### ఉగాది నాటికి గృహప్రవేశాలు జరగాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జగనన్న లే అవుట్‌లలో ఉగాది నాటికి లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఉగాది నాటికి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులతో మాట్లాడారు. వీఆర్‌ఓలు, పంచాయతీ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. నిర్మాణ పనులు వేగంగా చేసేలా మేస్త్రీలతో మాట్లాడాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన ఆర్థిక సహాయం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో హౌసింగ్ పీడీ చెన్నయ్య, ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

### బ్రాంచ్ పోస్టుమాస్టర్‌పై కేసు నమోదు

గుడ్లూరు: పోస్టాఫీసులో దాచుకున్న ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన రావూరు బ్రాంచ్ పోస్టుమాస్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాదరెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు ప్రకారం మండలంలోని రావూరు గ్రామంలో బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా పని చేస్తున్న లక్ష్మీ ప్రసన్న కుమారి గ్రామంలో పోస్టాఫీసులో గ్రామస్తులు సేవింగ్, ఆర్‌డీలు ద్వారా దాచిపెట్టుకున్న రూ.2.4 లక్షల నగదును రామాయపట్నం హెడ్‌పోస్టాఫీసులో జమ చేయకుండా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలోని కల్లగుంట గ్రామానికి చెందిన తన స్నేహితుడు ముత్తయ్య అనే యువకుడికి విడతలవారీగా ఇచ్చింది. ఆ నగదును అతను ఇవ్వకపోవడంతో లక్ష్మీ ప్రసన్న కుమారి నగదును జమ చేయలేదు. విషయం తెలుసుకున్న రామాయపట్నం పోస్టమాస్టర్ కందుకూరు హెడ్‌పోస్టాఫీసుకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో లక్ష్మీ ప్రసన్న కుమారి, ముత్తయ్యలు అనంతపురానికి పారిపోయి అక్కడ ఉంటున్నారు. నాలుగు రోజులు క్రితం కందుకూరు సూపరింటెండెంట్ శివాజీ గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఆమెపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్సై ప్రసాద్ రెడ్డి వారిద్దరూ అనంతపురంలో ఉన్నారని సమాచారం అందుకొని వారిని అదుపులోకి తీసుకొని గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారణ అనంతరం వారిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై తెలిపారు.

### ఫిష్ ఆంధ్ర స్టాల్స్‌ను విరివిగా ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మత్స్య శాఖ పీడీ చంద్ర శేఖర రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాబూరావు

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫిష్ ఆంధ్ర కార్యక్రమాన్ని విరివిగా ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్ర శేఖర రెడ్డి పిలుపునిచ్చారు. మత్స్య శాఖ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఫిష్ ఆంధ్ర మినీ లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం స్థానిక డీఆర్‌డీఏ డీటీడీసీ ప్రాంగణంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జేడీ చంద్ర శేఖర రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని చేపల వ్యాపారం చేయటానికి ఆసక్తి ఉన్న సుమారు 90 మంది లబ్ధిదారులు అవగాహన కార్యక్రమానికి వచ్చారన్నారు. పీఎంఎంఎస్‌వై ద్వారా అందించే ప్రభుత్వ పథకాలైన ఫిష్ ఆంధ్ర మినీ, త్రీ వీలర్ ఆటో, ఫోర్ వీలర్ ఆటోలు, బీఎఫ్‌ఎఫ్ కో బ్రాండింగ్ వారి ద్వారా అందించే రూ.10 లక్షలు-డైలీ, రూ.20 లక్షలు-సూపర్, రూ.50 లక్షలు-లాంజ్ పథకాల గురించి వివరించారు. ఫిష్ ఆంధ్ర మినీ పథకాన్ని లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బి.బాబూరావు పథకాన్ని డ్వాక్రా గ్రూపుల ద్వారా కూడా చేయించేందుకు అవిరళ కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీపీఎం పి.డేవిడ్, బ్యాంకు లింక్ సుబ్బారావుతో పాటు పలువురు పాల్గొన్నారు.



ఫిష్ ఆంధ్ర వాహనంతో అధికారులు

---

ఏళ్ల తరబడి సాగునీటికి నోచుకోక మెట్ట పైర్లకే పరిమితమైన మోపాడు ఆయకట్టు రైతులు 8,200 ఎకరాల్లో వరిసాగు చేసి సంబరంగా ఉన్నారు. రిజర్వాయర్ నుంచి సకాలంలో నీరు విడుదల చేయడంతో ముందస్తుగా వరి సాగు చేసుకున్న రైతులు వరిపైరును కోసి వెంటనే సేద్యంచేసి మళ్లీ వరినాట్లు వేశారు. రైతులకు నీరిచ్చే క్రమంలో రిజర్వాయర్ ఆధునికీకరణ, కట్టబలోపేతం చేసే పనులకు కొంత విరామమిచ్చిన అధికారులు మళ్లీ పనులు వేగంగా పూర్తిచేయడంపై దృష్టిపెట్టారు.



మోపాడు రిజర్వాయర్‌లో సమృద్ధిగా ఉన్న నీరు

# సాగు సంబరం

- మోపాడు ఆయకట్టులో ఓవైపు వరి కోతలు..మరోవైపు నాట్లు
- 23 అడుగుల్లో రిజర్వాయర్ నీరు..వచ్చే ఖరీఫ్‌కూ సాగునీరు
- నీటి సరఫరా, నియంత్రణపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి
- రూ.28 కోట్లతో మోపాడు రిజర్వాయర్ ఆధునికీకరణ
- ఆధునికీకరణ నిధులతోనే రిజర్వాయర్ కట్ట బలోపేతం
- ఎల్లో మీడియాలో అసత్య కథనాలపై రైతుల ఆగ్రహం

పామూరు: మండల వరప్రసాదిని మోపాడు రిజర్వాయర్ ఆయకట్టులో సాగు సంబరం నెలకొంది. దశాబ్దకాలం తరువాత రిజర్వాయర్‌కు పూర్తిస్థాయిలో నీరుచేరడంతో పామూరు మండలంతోపాటు నెల్లూరు జిల్లా కొండాపురం మండలంలో ఉన్న ఆయకట్టు భూములు పచ్చని పైర్లతో కళకళలాడుతున్నాయి. ముందస్తుగా వరిసాగు చేసుకున్న రైతులు వరిపైరును కోత కోశారు. రెండో విడతలో నాటిన వరిపైతం 20 రోజులు దాటి పచ్చదనాన్ని పరిచినట్లుగా ఉంది. దీనికితోడు ఆర్బీకేల్లో ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో మిల్లర్లు, బియ్యం వ్యాపారులు పోటీపడి పండిన ధాన్యాన్ని పొలాల్లోనే రైతులకు అధికరేట్లు చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రిజర్వాయర్‌లో నీరు ఉండటం, సాగుకు పొలాలకు నీరు వదలడంతో ఆయకట్టు దిగువప్రాంతంలో భూగర్భ జలాలు అనూహ్యంగా పెరిగి వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమ కూడా కళకళలాడుతోంది.

**సాగు వివరాలు:**

మోపాడు రిజర్వాయర్‌కు 2021లో పూర్తిస్థాయిలో నీరుచేరగా చెరువు అలుగుపారింది. ఈ సందర్భంలో రిజర్వాయర్ కట్టకు లీకులు ఏర్పడటంతో యుద్ధప్రాతిపదిన పనులు చేపట్టి లీకులు అరికట్టారు. దీంతో సాగుకొంత ఆలస్యమైంది. అదేవిధంగా గత ఏడాది రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు జరుగుతుండగా రైతులు ఆయకట్టులో మొదట ఆరుతడి పంటలుగా జొన్న, పొద్దుతిరుగుడు, నువ్వులు, సజ్జ పంటలు సాగు చేశారు. రైతుల కోరికపై ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాలతో మోపాడు ఆయకట్టులో వరి పైరుసాగు కోసం ఆధునికీకరణ పనులను తాత్కాలికంగా నిలిపివేసి సాగుకు నీరు ఇవ్వనున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు రైతులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంలో పామూరు మండలంలో అనధికారికంగా సుమారు 4,750 ఎకరాల్లో, నెల్లూరు జిల్లా కొండాపురం మండలంలో సుమారు 3,500 ఎకరాల్లో వరిపైరు సాగుచేయగా కొందరు ఈక్రాప్ సైతం చేయించుకోకపోవడం గమనార్హం. సుమారు దశాబ్దకాలం తరువాత మోపాడు ఆయకట్టులో వరిసాగు కావడంతో అన్నదాతల్లో ఆనందం నెలకొంది. గత టీడీపీ ప్రభుత్వం చంద్రబాబు హయాంలో తీవ్ర కరువుతో ఆయకట్టు పరిధిలో మెట్టపైర్లు తప్ప వరి సాగు చేసే అవకాశం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**23 అడుగుల్లో సమృద్ధిగా నీరు.. ఖరీఫ్‌కూ సాగునీటి నిల్వ:**

ప్రస్తుతం మోపాడు రిజర్వాయర్‌లో 23 అడుగుల వద్ద నీరు సమృద్ధిగా ఉంది. వచ్చే ఖరీఫ్‌లో ఆయకట్టులో వరిసాగు చేసేందుకు నీటిపారుదల శాఖ అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ప్రస్తుతం సాగుకు వదులుతున్న నీటిపై ప్రత్యేక దృష్టి సారించి నీరు వృథా కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. రైతులతో పదే పదే చర్చిస్తూ నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటున్నారు.

**నీటి సరఫరా, నియంత్రణపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి:**

రిజర్వాయర్ ఆయకట్టులో నీటి విడుదలపై, నీరు వృథా కాకుండా నియంత్రించడంపై ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల మండలంలోని కట్టకిందపల్లె, కరోళ్లపాడు గ్రామాల వద్ద మోపాడు ప్రధాన కాల్వలో నీటి సరఫరాను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నీటిపారుదల శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడ వరి, అలసంద రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే నీటి విడుదలపై అడిగి తెలుసుకుని ఒక్క నీటిబొట్టు కూడా వృథా కారాదని, వచ్చే ఖరీఫ్‌కు ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా చూడాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

**ఎల్లో మీడియాలో అసత్య కథనాలపై ఆగ్రహం**

ఇటీవల ఎల్లో మీడియాకు చెందిన ఒక పత్రికలో రిజర్వాయర్ కట్టబలోపేతం, సాగుపై ప్రచురితమైన అసత్య కథనంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మోపాడు రిజర్వాయర్ ఆధునికీకరణకు జైకా నిధుల సాధనకు గత 12 ఏళ్ల నుంచి ఎమ్మెల్యేలు కేవలం ప్రతిపాదనలకే పరిమితమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే మధుసూదన్ యాదవ్ పట్టుబట్టి రూ.28 కోట్ల జైకా నిధులు సాధించి మోపాడు రిజర్వాయర్ ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. 2021లో రిజర్వాయర్‌కు ఏర్పడిన లీకులను అధికారులు, స్థానిక నాయకుల సాయంతో పూడ్చివేయించి పూర్తిస్థాయిలో మరమ్మతులు, కట్టబలోపేతం కోసం మరో రూ.3.50 కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపగా అవి మంజూరు దశలో ఉన్నాయి. నాడు పట్టించుకోని పచ్చమీడియా నేడు ఇలాంటి పచ్చరాతలు రాయడం ఏమిటని ముక్కున వేలేసుకుంటున్నారు.



మోపాడు, కొండారెడ్డిపల్లె మధ్య సాగులో ఉన్న వరిపైరు



తూము ద్వారా ప్రధాన కాల్వకు విడుదలవుతున్న నీరు

**ఆధునికీకరణ నిధులతో రిజర్వాయర్ కట్ట బలోపేతం**



మోపాడు రిజర్వాయర్‌కు సంబంధించి రూ.28 కోట్లతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన కాల్వ పనులు పలు ప్రాంతాల్లో మొదలై వివిధ దశల్లో జరుగుతున్నాయి. సాగునీటి విడుదల కోసం పనులు నిలిపివేశాం. కట్టలీకుల ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల్లో కట్టను బలోపేతం చేసేందుకు ప్రస్తుతం జైకా నిధులతో చేస్తున్న ఆధునికీకరణ పనుల్లోనే ఈ పనులను కలిపి త్వరలో పూర్తిచేస్తాం. ప్రస్తుత నీటి విడుదలను త్వరలో నిలిపి వచ్చే ఖరీఫ్‌కు నీరు ఇస్తాం.

– బి.రవి, ఇరిగేషన్, డీఈ

**మోపాడుకు వెలిగొండ నీటితో శాశ్వత పరిష్కారం**



మోపాడు రిజర్వాయర్‌ను వెలిగొండ పరిధిలో చేర్చి రిజర్వాయర్‌కు శాశ్వత ప్రాతిపదికన నీటి వసతి ఉండేలా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌తో కలసి కృషిచేస్తున్నాం. సాగుకు నీటి సరఫరా నిలిపిన వెంటనే ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయించి ఆయకట్టులోని రైతాంగానికి సాగునీరు ఇచ్చి పంటలు సాగయ్యేలా చేయడంతోపాటు, పాడి పరిశ్రమకు కూడా నీటి ఇక్కట్లు లేకుండా చూస్తాం.

– గంగసాని లక్ష్మి, ఎంపీపీ

**7 ఎకరాల్లో వరిసాగు చేశా**



మోపాడు ఆయకట్టు కింద 7 ఎకరాల్లో వరిసాగు చేశా. సుమారు దశాబ్దకాలం తరువాత వరిసాగు చేసినందుకు సంతోషంగా ఉంది. ఆయకట్టులో కొందరు రైతులు ముందస్తుగా ఆరుతడి పంటలు వేయడంతో వరి కాస్త ఆలస్యమయింది. వచ్చే ఖరీఫ్‌కు ప్రతి ఎకరా సాగులోకి వస్తుంది. ధాన్యాన్ని ఆర్బీకేలలో ప్రభుత్వం కొంటుండగా పోటీగా వ్యాపారులు పొలాల వద్దే కొనుగోలుకు వస్తున్నారు.

– దండు రామక్రిష్ణ, రైతు, మోపాడు

---

## కలిసికట్టుగా పనిచేద్దాం..

# విజయం సాధిద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, వేదికపై జంకె వెంకటరెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్, చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి, శ్యాం ప్రసాదరెడ్డి

- వైఎస్సార్ సీపీకి ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రతిష్టాత్మకం
- కనిగిరిలో మెజార్టీ వస్తే శ్యాంప్రసాద్‌రెడ్డి గెలిచినట్లే..
- విశాఖ సమ్మిట్‌తో జాతీయ స్థాయికి ఎదిగిన సీఎం వైఎస్ జగన్
- టీడీపీ హయాంలో దోపిడీ తప్ప అభివృద్ధి లేదు
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

కనిగిరి రూరల్: త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు వైఎస్సార్ సీపీకి ప్రతిష్టాత్మకం, మనమంతా కలిసికట్టుగా పనిచేసి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక తాళ్లూరి కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రామధుసూదన్ యాదవ్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలుంటే పక్కన పెట్టి ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌తో కలిసి పనిచేయాలన్నారు. కనిగిరిలో మెజార్టీ వస్తే శ్యాం ప్రసాద్‌రెడ్డి విజయం సాధించినట్లేనని వెల్లడించారు. ప్రతి ఒక్కరితో ఓటు వేయించుకునేలా పార్టీ శ్రేణులంతా ఐక్యతగా పనిచేయాలన్నారు. ప్రత్యర్థి అభ్యర్థి కనిగిరి వాసి అయినందున ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలన్నారు. వైజాగ్‌లో జరిగిన సమ్మిట్ విజయవంతంతో సీఎం వైఎస్ జగన్ జాతీయ స్థాయి నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చారన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధిలో దూసుకెళ్తున్నట్లు చెప్పారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు ఏపీలో అమలవుతున్నాయన్నారు. టీడీపీ హయాంలో ఒక్క సంక్షేమ పథకాన్ని అయినా పూర్తిగా అమలు చేశారా అని విమర్శించారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల విజయాన్ని జగనన్నకు బహుమతిగా ఇవ్వాలి:**

ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్యాం ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిలకు మంచి మెజార్టీతో గెలిపించి ప్రకాశం జిల్లా తరఫున జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు.

**గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం:**

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. కనిగిరిలో అత్యధిక మెజార్టీని తీసుకొచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామని తెలిపారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ చింతల చెరువు సత్యనారాయణరెడ్డి అన్నారు. పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు సమష్టి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

**ఒక్క అవకాశం ఇవ్వండి:**

తన ఒక్క అవకాశం ఇచ్చి పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాం ప్రసాద్‌రెడ్డి అన్నారు. తనను గెలిపిస్తే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే బుర్రామధుసూదన్ యాదవ్‌లతో కలిసి మన ప్రాంత ప్రజల అభివృద్ధికి పనిచేస్తానన్నారు. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల్లో ప్రథమ ప్రాధాన్యత ఓటును తనకు, ఉపాధ్యాయుల్లో చంద్ర శేఖరరెడ్డికి వేయాలని కోరారు. ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. అలాగే మున్సిపల్ ఛైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వైఎం ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీలు కస్తూరిరెడ్డి, మేకల శ్రీనివాసులు, గుంట తిరుపతిరెడ్డి ఎంపీపీ ప్రకాశం, గంగసాని లక్ష్మి, పోతు కొండారెడ్డి, ఓమ్మెగా రామిరెడ్డి, గాయం బలరాంరెడ్డి, రాష్ట్ర వాసవీ సత్ర సముదాయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడారు.

కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వైఎం సరితారెడ్డి, జెడ్పీటీసీలు చప్పిడి సుబ్బయ్య, దద్దాల నారాయణ, గాయం సావిత్రి, లక్ష్మీకాంతం, రంగనాయకుల రెడ్డి, పెరుగు మురళి, భవనం కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు పాల్గొన్నారు. తొలుత వైజాగ్ సమ్మిట్ కార్యక్రమం విజయవంతం సందర్భంగా నాయకులు కేక్ కట్ చేశారు. వైఎస్సార్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

## విశాఖ వైపు ఔత్సాహిక పారిశ్రామిక దిగ్గజాలు



కేక్ కట్ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, పార్టీ నాయకులు

- యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రధాన ధ్యేయం
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: విశాఖపట్నం వైపు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ దృష్టి సారించారని, రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ రథసారథి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రెండు రోజులుగా జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ 2023 నూటికి నూరు శాతం విజయవంతం అయిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. వైజాగ్‌లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ విజయవంతమైన సందర్భంగా సోమవారం స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేద యువత ఎంతగానో ఎదురు చూస్తున్న సమయంలో జరిగిన ఈ పెట్టుబడిదారుల సదస్సు పూర్తిగా సీఎం కార్యదక్షతకు, ఆలోచన విధానానికి అద్దంపట్టిందని అన్నారు. నాలుగేళ్లుగా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి జగనన్న పరిపాలన సాగించారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదు, ఒక కొత్త కంపెనీ అయినా వచ్చిందా అంటూ ప్రతిపక్షాలు సవాళ్లు చేస్తున్న పరిస్థితుల్లో జరిగిన ఈ పెట్టుబడిదారుల సదస్సులో రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చారని, ఈ పెట్టుబడులతో 6 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా రెండు రోజుల్లో 350 పైబడి ఒప్పందాలను ఏర్పరుచుకున్నామని ఆయన అన్నారు. విశాఖపట్టణం మహానగరాన్ని రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ పరిపాలనా రాజధానిగా చూపిస్తున్న తరుణంలో మౌలిక వసతులు, పర్యావరణం, చక్కటి రోడ్ల వసతి కల్పించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 28, 29 తేదీలలో జీ-20 సదస్సును ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సదస్సు విజయవంతం కావటానికి సీఎం కష్టపడ్డారని అన్నారు. గత ప్రభుత్వాలు గ్రాఫిక్స్‌లో చూపించిన రాజధాని, అభివృద్ధి లాంటిది తమ ప్రభుత్వం కాదని, జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొని వచ్చిన నూతన సంస్కరణలు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వైపాలెం, పుల్లలచెరువు పార్టీ మండల కన్వీనర్లు కె.ఓబుల్‌రెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు, ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాలచెన్నయ్య, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, వాడాల పద్మా, డి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి సోమవారం సాయంత్రం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో శాశ్వతంగా కరువును నివారించే వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని విన్నవించారు. మెడికల్ కళాశాల పనులు జరుగుతున్నాయని చెప్పారు. మార్కాపురం పట్టణంలో షాదీఖానా నిర్మాణ పనులు 40 శాతం పూర్తయ్యాయని, మిగిలిన నిర్మాణం పూర్తి కావడానికి అవసరమైన నిధులు విడుదల చేయాలని, పొదిలి పట్టణంలో ఫైర్ స్టేషన్ మంజూరు చేయాలని కోరారు. మార్కాపురం టౌన్‌లో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని, నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో గ్రామాల్లో ప్యాచ్ వర్కులకు నిధులు విడుదల చేయాలని విన్నవించారు. నాలుగేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.1000 కోట్లు నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపినట్లు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఆయన సోదరుడు మార్కాపురం మాజీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ ఆలీ బేగ్, రాష్ట్ర సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల శాఖ డైరెక్టర్ మేడా భద్రీనాథ్ ఉన్నారు.



సీఎం వైఎస్ జగన్‌తో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, షంషేర్ ఆలీబేగ్

## క్లుప్తంగా

### ఉరేసుకుని వ్యక్తి మృతి



**టంగుటూరు:** చెట్టుకు ఉరేసుకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన టంగుటూరు మండలంలోని వల్లూరు చెరువు కట్టపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జరుగుమల్లి మండలం నర్సింగోలు గ్రామానికి చెందిన మల్లెబోయిన వెంకటస్వామి(55) కావేరి ట్రావెల్స్‌లో పనిచేసేవారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో కొంత కాలంగా గ్రామంలోనే ఉంటూ కూలి పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే వల్లూరు చెరువు కట్టపై ఉరేసుకొని ఉంటాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

### అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ నిర్వహణలో ప్రకాశం వాసులకు బాధ్యత



వెంకటాద్రిరెడ్డి, రామకృష్ణారెడ్డి

**ఒంగోలు:** ఈనెల 19న విశాఖపట్నంలో భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య వన్‌డే క్రికెట్ మ్యాచ్ నిర్వహణలో జిల్లా వాసులు ఇరువురికి అవకాశం లభించింది. చీఫ్ సెక్యూరిటీ ట్రాఫిక్ కమిటీలో ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన ఎం.వెంకటాద్రిరెడ్డి, ఫుడ్ అండ్ హైజీనిక్ కమిటీలో ఎం.రామకృష్ణారెడ్డి ప్రాతినిధ్యం వహించాలని ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి ఆదేశించారు.

# వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

- పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే బాలినేని విజ్ఞప్తి
- మామిడిపాలెం సమ్మర్ స్టోరేజీ ట్యాంకుపై వాకర్స్‌తో భేటీ
- త్వరలోనే ఎస్‌ఎస్ ట్యాంకుపై వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేస్తానని హామీ



వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

**ఒంగోలు:** వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉదయం స్థానిక మామిడిపాలెం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు కట్టపై వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి, ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తద్వారా సమస్యలపై సీఎంతో నేరుగా మాట్లాడి పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం బాలినేని మీడియాతో మాట్లాడుతూ.. విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్తశుద్ధిని ప్రజలు అర్థం చేసుకుని మద్దతుగా నిలవాలని ఆశిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా పలువురు వాకర్స్ సమస్యలు తెలియజేయగా బాలినేని సానుకూలంగా స్పందించారు. రంగారాయుడు చెరువు కట్ట మాదిరిగానే మామిడిపాలెం చెరువు కట్టను కూడా అభివృద్ధి చేసి వాకర్స్‌కు ఇబ్బంది లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తదనంతరం స్థానిక మంగమూరు రోడ్డులోని ఇన్ఫ్లుయెన్స్ షోరూం వద్ద టీ తాగేందుకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించారు.

**మహిళా సాధికారతకు సీఎం వైఎస్ జగన్ కృషి**

మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలు బూచేపల్లి వెంకాయమ్మ, నగర ప్రథమ పౌరురాలు గంగాడ సుజాత, ఒడా చైర్మన్ సింగరాజు మీనాకుమారి ఇలా ఎంతో మంది మహిళలకు పదవులు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. 50 శాతం పదవులు మహిళలకు కేటాయించడం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. నామినేటెడ్ పదవుల్లో సైతం 50 శాతం మహిళలకే కేటాయించారన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షిస్తూ మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. బాలినేని వెంట నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, వాసవీ క్లబ్ రాష్ట్ర నాయకులు శిద్దా సూర్యప్రకాశరావు, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, యనమల నాగరాజు, చింతపల్లి గోపీ, ఈదర వెంకట సురేష్ బాబు, ఛల్లా తిరుమలరావు, ఢాకా సుజాత హనుమారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ మీరావలి, నాగూర్, గోవర్ధన్‌రెడ్డి, వల్లెపు మురళి, మారెళ్ల శ్రీదేవి శ్రీనివాస్, అంగలకుర్తి రవి, తోటపల్లి సోమశేఖర్, వరదా నాగేశ్వరరావు, కుర్రాప్రసాద్, నగరికంటి శ్రీనివాస్, దుంపా చెంచిరెడ్డి, కేకేరాజు, తన్నీరు నాగేశ్వరరావు, రాచమళ్ల బ్రహ్మారెడ్డి, తిర్లిక శ్రీనివాసరావు, మోడుబోయిన సురేష్‌యాదవ్, బడుగు కోటేశ్వరరావు, చింతగుంట్ల సువర్ణ, బడుగు ఇందిర తదితరులు ఉన్నారు.



బ్యాలెట్ నమూనా అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

## మంత్రి సురేష్ ఇంటింటి ప్రచారం

**యర్రగొండపాలెం:** వైఎస్సార్ సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కోరారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ నగర్‌లో ఆయన విస్తృతంగా పర్యటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధిని పట్టభద్రులు గమనించాలని, వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించినట్లయితే ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రులకు మరింత మేలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి నమూనా బ్యాలెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఐ.వి.సుబ్బారావు, సూరె రమేష్, మొగలి సుబ్బారావు, సర్పంచ్ ఆర్.అరుణాబాయి పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి

- ఎన్నికల కమిషన్‌కు మైక్రో అబ్జర్వర్లు కీలకం
- ఎన్నికల పరిశీలకులు కోన శశిధర్, కాటంనేని భాస్కర్



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు కాటంనేని భాస్కర్, పక్కన కోన శశిధర్. ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు

**ఒంగోలు అర్బన్:** ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల పరిశీలకులు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం స్పందన భవనంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఉపాధ్యాయ నియోజకవర్గం పరిశీలకులు కోన శశిధర్, పట్టభద్రుల నియోజకవర్గ పరిశీలకులు కాటంనేని భాస్కర్ పాల్గొని పలు సూచనలు చేశారు. కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగడంలో ఎలక్షన్ కమిషన్‌కు మైక్రో అబ్జర్వర్లు కీలకంగా వ్యవహరిస్తారన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలే ప్రామాణికమన్నారు. నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియ జరగడంలో లోపాలు, ఉల్లంఘనలు ఉంటే వాటిని వెంటనే పై స్థాయి అధికారులకు తెలపాలన్నారు. ఎన్నికలకు ముందు రోజే పోలింగ్ కేంద్రానికి చేరుకుని అక్కడి పరిస్థితులు, సౌకర్యాలను పరిశీలించాలని సూచించారు. రాత్రికి అక్కడే బస చేయాలన్నారు. కోన శశిధర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రిసైడింగ్ అధికారుల పట్ల గౌరవంగా ఉండాలన్నారు. మౌలిక, భద్రతాపరమైన లోపాలు గమనిస్తే వాటిని సరిచేయాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు సకాలంలో స్పందించడం ఎంతో కీలకమన్నారు. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలు, పీవోలకు, ఏపీవోలకు ఇచ్చిన శిక్షణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని సిద్ధం చేస్తున్న విధానం పట్ల ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఎన్నికల పరిశీలకులకు వివరించారు. దీనిలో ప్రకాశం జిల్లా ఎస్పీ మలికాగర్గ్, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, బాపట్ల జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, ప్రకాశం ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ ఓబులేసు, ఇతర అధికారులు లక్ష్మీ శివజ్యోతి, సేతు మాధవన్, విశ్వేశ్వరరావు, సందీప్‌కుమార్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

- క్షతగాత్రులంతా మహిళా కూలీలే..



చికిత్స పొందుతున్న నాగమ్మ



సుబ్బులు..

**తర్లుపాడు:** ఆటో బోల్తా పడి ఆరుగురు మహిళా కూలీలకు గాయాలైన సంఘటన సోమవారం తర్లుపాడు మండలంలోని గోరుగుంతలపాడు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో వాటర్ ట్యాంక్ ఎదురుగా నివాసం ఉంటున్న పలువురు మహిళా కూలీలు సోమవారం ఉదయం మాల్యావంతునిపాడు గ్రామంలో మిర్చి కోతలకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఆటోలో మార్కాపురానికి బయల్దేరారు. ఆటో గోరుగుంతలపాడు–కొండేపల్లి గ్రామాల మధ్యలో అదుపు తప్పి బోల్తా పడటంతో నాగమ్మ, సుబ్బులు, జి.కోటమ్మ, డి.మస్తానమ్మ, బాలమ్మ, వెంకటలక్ష్మమ్మకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సులో మార్కాపురంలోని జిల్లా వైద్యశాలకు తరలించారు. కోటమ్మ, నాగమ్మను మెరుగైన చికిత్స కోసం ఒంగోలు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముక్కంటి తెలిపారు.

### రైల్వే ట్రాక్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ఒంగోలు:** కరవది–ఒంగోలు రైల్వేస్టేషన్ల మధ్య డౌన్‌లైన్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే ఎస్సై పి.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుని వయసు సుమారు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుంది. కాఫీ రంగు టీషర్టు, నీలి రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. అతని వద్ద ఇతర ఆధారాలేవీ లభించలేదు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే 9440627647, 9490566577 సెల్ నంబర్లను సంప్రదించాలని ఎస్సై కోరారు.

### ఆర్టీసీ డిపో ఎదుట మరొకరు..



**ఒంగోలు:** స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఓ బార్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పక్కనే ఉన్న మొబైల్ షోరూమ్‌లో పనిచేస్తున్న యువకుడు సమాచారం ఇవ్వడంతో దిబ్బల రోడ్డు సచివాలయ సిబ్బంది పరిశీలించి తాలూకా పోలీసులకు తెలియజేశారు. సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉండవచ్చని, మృతికి గల కారణాలు తెలియదని పేర్కొంటూ దిబ్బలరోడ్డు వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలిసిన తాలూకా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై సురేష్ విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్యం జాగ్రత్త సుమా..

- మహిళా సిబ్బందికి ఎస్పీ మలికాగర్గ్ సూచన
- ఐపీఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్, పక్కన ఏఎస్పీ నాగేశ్వరరావు తదితరులు

**ఒంగోలు:** మహిళా పోలీసు సిబ్బంది ఆరోగ్యం విషయంలో అత్యంత శ్రద్ధ వహించాలని ఎస్పీ మలికాగర్గ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐపీఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసు కళ్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. క్యాంపులో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఆరోగ్యం, ఆనందానికంటే ప్రజాభద్రతకే పోలీసులు అధికప్రాధాన్యత ఇస్తారన్నారు. ఈ నేపథ్యంలో అనారోగ్య సమస్యలు వెన్నాడుతుంటాయని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వ్యక్తిగత ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఎస్పీ సూచించారు. సరైన పోషకాహారం తీసుకోవడంతోపాటు ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే తగిన వైద్య చికిత్స పొందాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబం, తద్వారా సమాజం బాగుంటుందన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ఒత్తిడిని ఎదుర్కొనేందుకు యోగా, ధ్యానం సాధన చేయాలని చెప్పారు. వైద్య శిబిరంలో 330 మందికిపైగా మహిళా పోలీసులు, వారి కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకోగా ఉచితంగా మందులు అందజేశారు. క్యాంప్ నిర్వహణకు కృషి చేసిన జిల్లా పోలీసు అధికారులు, రమేష్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ప్రతిమ, ఒమేగా హాస్పిటల్ డాక్టర్ హనీషా, బెతూన్ నర్సింగ్ హోం డాక్టర్ స్వాతి, ఉపాస్ హాస్పిటల్ డాక్టర్ జ్యోత్స్న, కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ సుజని, పోలీసు యూనిట్ వైద్యురాలు భానుమతి తదితరులను ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

## తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళిక



వేసవిలో తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

**ఒంగోలు అర్బన్:** వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రాకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు తాగునీటి సరఫరాపై సోమవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలు, నియోజకవర్గాల వారీగా తాగునీటి లభ్యతపై ఆరా తీశారు. క్రాష్ కార్యక్రమం కింద చేతిపంపుల మరమ్మతులను తక్షణమే చేపట్టాలన్నారు. స్థానికంగా నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాల్లో ట్యాంకర్లతో సరఫరా చేయాలని స్పష్టం చేశారు. స్థానిక అవసరాలకు అవసరమైన నిధులు, పెండింగ్ బిల్లులను వెంటనే గ్రీన్ చానల్‌లో చెల్లించేలా ప్రభుత్వానికి లేఖ రాయాలని సూచించారు. ఈ ఏడాది నుంచి వాతావరణంలో ఎల్‌నినో ప్రభావం ప్రారంభమవుతున్నందున నీటి వనరుల వినియోగంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సాగర్ నీటి విడుదల విషయంలో పల్నాడు జిల్లా అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. పల్నాడు కలెక్టర్‌తో తాను మాట్లాడతానని తెలిపారు. ముందుగా తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇచ్చి చెరువులు నింపాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్య ఎదురైతే పరిస్థితిని అంచనా వేసి తదుపరి చర్యలు తీసుకునేందుకు మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మర్దన్ అలీ, ఇరిగేషన్ ఎస్‌ఈ లక్ష్మారెడ్డి, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ, మున్సిపాలిటీల కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.